

మేధోమంథన్

విద్యార్థుల్లో దాగిన ప్రతిభ, ఆలోచన, ఆవిష్కరణలను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తుంది. 8లో..



కన్నబాబు ఇంట విషాదం

మాజీ మంత్రి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ(76) మృతి చెందడంతో ఆ పార్టీ శ్రేణుల్లో విషాదం అలుముకుంది. 8లో..



నకిలీ దస్తావేజులతో రిజిస్ట్రేషన్లు

నకిలీ దస్తావేజులు సృష్టించి స్థలాలను విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్లు రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. 8లో..

న్యూస్‌రీల్

ఏలేరుకు వరద నీరు



ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

ఏలేశ్వరం: పరివాహక ప్రాంతంలో పడుతున్న వర్షాలకు ఏలేరుకు వరద నీరు వచ్చి చేరుతోంది. రెండురోజులుగా పడుతున్న వర్షాలకు మంగళవారం ప్రాజెక్టులోకి 5,218 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. మరో రెండురోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలపడంతో మరింతగా వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరనుంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి 525 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.46 మీటర్లకు 79.25 మీటర్లు, 24.11 టీఎంసీలకు 12.59 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో విశాఖకు 200, తిమ్మరాజుచెరువుకు 20 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టుకు నీటి విడుదల నిలిపివేశారు.

పంపా కాలువకు గండి

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురం, తొండంగి మండలం వలసపాకల (పి.అగ్రహారం) సమీపంలో పంపా వరదనీటి కాలువకు సోమవారం రాత్రి గండిపడింది. ఆ ప్రాంతాన్ని, నీటమునిగిన పంట పొలాలను ఇరిగేషన్ అధికారులతో కలసి తుని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్.శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. యుద్ధప్రతిపాదికన గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రెండువేల ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని పూడ్చివేస్తామన్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు, పుష్కరనీరు అందుబాటులోకి రావడంతో ఇటీవల రైతులు వరినాట్లు వేస్తున్నారు. టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన 30ఎకరాలకు పైగా పంటలు నీటిముంపునకు గురైనట్టు స్థానికులు పేర్కొన్నారు.

స్థల వివాదంపై 22న ట్రావెర్స్ సర్వే

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఘాట్ రోడ్ పక్కనే పంపా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న స్థలంపై దేవస్థానం, ఇరిగేషన్ శాఖల మధ్య నెలకొన్న వివాదానికి తెర దించేందుకు ఈ నెల 22న టావెర్స్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ స్థలం దేవస్థానానికి చెందుతుందా లేక, ఇరిగేషన్ శాఖకు చెందుతుందా అనే దానిపై 15 సంవత్సరాలుగా ఈ వివాదం కొనసాగుతోంది. ఇప్పటికి నాలుగుసార్లు సర్వే చేశారు. మొదటిసారి సర్వే మధ్యలో నిలిచిపోయింది. రెండోసారి నిర్వహించిన సర్వేలో స్థలం దేవస్థానానిదే అని తేలినా ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం చెప్పడంతో కలెక్టర్ మూడోసారి జాయింట్ సర్వేకు ఆదేశించారు. ఏప్రిల్ ఒకటిన పెద్దాపురం ఆర్డీఓ రమణి పర్యవేక్షణలో దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో సర్వే చేశారు. దానిపై ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం తెలపడంతో ట్రావెర్స్ సర్వేకు ఆదేశాలిచ్చారు. ట్రావెర్స్ సర్వేలో వివాద స్థలం ముందు వెనుక గల స్థలాలను కూడా సర్వే చేస్తారు. సర్వే అధికారులు ఎక్కడికక్కడ సర్వే రాళ్లు పాతి దీనిని నిర్వహిస్తారు. రత్నగిరి కొండ పరిధిలో గల 24 బీ సర్వే నంబర్‌లో స్థలంలో ట్రావెర్స్ సర్వే చేయనున్నారు.

ట్యాబ్‌లతో లబోదిబో

- ఒక్కొక్క ట్యాబ్‌కు రూ.30 వేల ఖర్చు
- గత ప్రభుత్వంలో 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ
- సాఫ్ట్‌వేర్ సమస్యలను పట్టించుకోని కూటమి సర్కారు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి విద్యార్థీ ఉన్నతంగా చదవాలి. ప్రపంచంతో పోటీ పడాలి॥ అన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ విద్యకు వెన్నుదన్నుగా నిలిచింది. సాంకేతిక విద్యపై విద్యార్థులు మక్కువ పెంచుకునేలా చర్యలు చేపట్టింది. కోట్ల రూపాయలు వెచ్చించి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా అందజేసింది. వీటి ద్వారా విద్యార్థులు సమోన్నతంగా ఎదిగేలా కృషి చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పని చేయని ట్యాబ్‌లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హుందాగా వ్యవహరించాల్సింది పోయి దిగజారుడు రాజకీయాలకు తెర తీస్తోందంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందజేసింది. 2022–23వ సంవత్సరం నుంచి వరుసగా రెండేళ్ల పాటు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఆ ట్యాబ్‌ల ద్వారా అత్యాధునిక సాంకేతికతతో బోధించేవారు. పిల్లలు కూడా చక్కగా నేర్చుకునేవారు. రోజూ పాఠశాలకు తీసుకువచ్చి తరగతి గదిలో టీచర్లు బోధించే పాఠ్యాంశాలను విని.. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు తమతో పాటు ట్యాబ్‌లను తీసుకువెళ్లేవారు. పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగానికి ఇంటర్నెట్ సదుపాయం కూడా కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని నిర్వీర్యం చేస్తోంది. కనీస పర్యవేక్షణ, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ లేకపోవడంతో అవి మూలన పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

లీప్ యాప్‌లో వీడియోలు

ఇటీవల కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న లీప్ యాప్‌లో వీడియోలను రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఆ వీడియో పాఠాలను టీచర్లు తరగతి గదిలో డిజిటల్ ప్యానల్ టీవీ ద్వారా బోధిస్తున్నారు. అయితే ట్యాబ్‌ల విషయం మరిచిపోయారు. ట్యాబ్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడంతో చాలావరకు అవి పనిచేయడం లేదు. కొన్ని అసలు ఆన్ కావడం లేదు. ఎక్కడైనా టీచర్లు చొరవ తీసుకుని ట్యాబ్ ద్వారా బోధిద్దామని యత్నించినా పనిచేయడం లేదు. ట్యాబ్‌లను సరఫరా చేసిన సంస్థ టెక్నీషియన్లు పర్యవేక్షణ విభాగాన్ని మూసివేయడం మరింత ఇబ్బందిగా మారింది.

డిజిటల్ అసిస్టెంట్లు ప్రతి నెలా పాఠశాలల సందర్శన

విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ బాధ్యతలను డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు గత ప్రభుత్వంలో అప్పగించేవారు. డిజిటల్ అసిస్టెం ట్లు ప్రతినెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలనూ సందర్శించి ట్యాబ్‌లు పనితీరును చెక్ చేసి మరమ్మతు బాధ్యతలు కూడా వారే చూసేవారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పాఠశాలను సందర్శించి ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబ్‌లకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసేవారు. బైజూస్, డిక్షనరీలను అందుబాటులో ఉంచి అప్‌డేట్ చేయడానికి ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల హెచ్ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చేవారు. పాఠశాల స్థాయిలోనే అప్డేట్ చేయించేవారు. అప్డేట్ చేసే క్రమంలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్ లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించేవారు.

పర్యవేక్షించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఇచ్చిన విలువైన ట్యాబ్‌లు ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ అప్డేట్ సమస్యతో పనిచేయడం లేదు. గత ప్రభుత్వం ఆ ట్యాబ్‌లను ఇవ్వడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. విద్యాభివృద్ధి విషయంలో పర్యవేక్షణ లోపం ఉండడం సరైన పద్ధతి కాదు. వెంటనే ట్యాబ్‌లకు మరమ్మతులు చేయాలి.

– ఎం.గంగాసూరిబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

విద్యార్థులకు ఉపయోగం



గత ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరమైనవి. దేశంలో ఎక్కడా విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చిన దాఖలా లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. వారికి అందజేసిన ట్యాబ్‌లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

– కె.లలిత్‌కుమార్, స్టేట్ స్టూడెంట్ డెవలప్‌మెంట్ కన్వీనర్, విద్యార్థి పరిషత్

జిల్లా సమాచారం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 933

ప్రాథమికోన్నత పాఠశాలలు 105

ఉన్నత పాఠశాలలు 247

మొత్తం పాఠశాలలు 1,285

1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు 1,25,790

రెండేళ్ల పాటు విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు 43,081

ఖర్చు చేసిన మొత్తం – రూ.131.23 కోట్లు

స్పందించని అధికారులు

సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తెచ్చింది. పాఠ్యాంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా బైలింగ్వల్ పద్ధతిలో పుస్తకాలను ముద్రించింది. 2022–23లో జిల్లాలోని విద్యార్థులు, టీచర్లకు కలిపి మొత్తం 23,099 ట్యాబ్‌లను పంపిణీ చేసింది. దీనికోసం రూ.67.23 కోట్లు ఖర్చు చేయగా 2023–24లో 380 పాఠశాలల్లో దాదాపు రూ.64 కోట్ల ఖర్చుతో 19,982 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఇందుకోసం ఒక్కో ట్యాబ్‌పై సుమారు రూ.30 వేల దాకా ఖర్చుచేశారు. తమ వద్ద ఉన్న ట్యాబ్‌లు సాఫ్ట్‌వేర్ సమస్యలతో మొరాయిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. సమస్యను టీచర్లు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందనా లేదు.

వేద పఠనంతో పులకించిన కుమారారామం



వేద సభ నిర్వహిస్తున్న పండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వరాలయం మంగళవారం వేద పఠనంతో పులకించింది. బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో 27వ వేదసభను పంచారామ క్షేత్రంలో నిర్వహించారు. సీనియర్ వేద పండితులు శ్రీపాద రాజశేఖరశర్మ అధ్యక్షత వహించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాకు చెందిన వేద పండితులు పాల్గొన్నారు. దువ్వూరి సూర్యప్రకాశ చైనులు ఘనపాఠి, తంగిరాల సుబ్రహ్మణ్య సోమయాజులు ఘనపాఠి వేదాల ప్రాధాన్యాన్ని వివరించారు. తరుచూ వేద పారాయణ జరిగే ప్రాంతాలు ప్రగతి సాధిస్తాయని వారు తెలిపారు. సృష్టిలో ప్రతీ జీవికి వేదశాస్త్రం అనేక విధాల క్షేమకారిగా రక్షణ కలిగిస్తుందని వివరించారు. వేదాలను సరళమైన రీతిలో ప్రజలకు చేరువ చేసే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలన్నారు. వేదసభలో పాల్గొన్న సుమారు 200 మంది వేద పండితులు హిందూ సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ చతుర్వేద పారాయణ, వేదస్వస్తి చెప్పారు. వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఈఓ బళ్ల నీలకంఠం, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, పారిశ్రామికవేత్త నలజర్ల కామేశ్వరరావు (పెదబాబు), భక్త సంఘం నాయకులు చుండ్రు గోపాలకృష్ణ, గంజి బూరయ్య, ఆర్వీ సుబ్బరాజు, బిక్కిన రంగనాయకులు, వేదశాస్త్ర పరిషత్తు కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ పండితులను సత్కరించారు. వేద పరిషత్తుకు సహకరించిన దాతలను సత్కరించారు.

రాష్ట్రంలో స్తంభించిన పరిపాలన



పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలతో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

శాసనమండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో పరిపాలన స్తంభించిపోయిందని, ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, మర్డర్లు, మహిళలపై అఘాయిత్యాలు, భూకబ్జాలు పెరిగిపోయాయని రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన అక్రమ మద్యం కేసులో అరెస్టయి సెంట్రల్ జైల్లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. అనంతరం బొమ్మూరులోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ బొత్స సత్యనారాయణ ముఖ్యనేతలతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఒకపక్క అధిక వర్షాలు వచ్చి రైతులకు కావాల్సిన ఎరువులను అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి అవగాహన, కార్యాచరణ, ముందుచూపులేకపోవడం వలన రాష్ట్రంలో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఎం చంద్రబాబు ఎక్స్‌పీరియన్స్ అంటూ సొల్లు కబుర్లు చెప్పడమే తప్ప ఆచరణలో లేదని బొత్స విమర్శించారు. కూటమి ప్రభుత్వం మంచిపాలనను ఐదురోజుల నుంచి చూస్తున్నాం వారి శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు ఏవిధంగా ప్రవర్తిస్తున్నారో తెలుస్తోందన్నారు. శాసనమండలి ప్రతిపక్షనేతగా ఉన్న తాను ప్రెస్‌తో మాట్లాడుతుండగా డ్రోన్ ఎగురవేయడంపై ఆయన మండిపడ్డారు. ఏమైన అడిగితే లా అండ్ ఆర్డర్ సమస్య అంటారన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, చట్టం తన పనిచేసుకునేలా ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలన్నారు. అమరావతి ముంపు సమస్యపై విలేకరుల అడిగిన ప్రశ్నకు పదిరోజుల్లో అంతా తెలుస్తుందని బొత్స బదులిచ్చారు. ఫ్రీ బస్సు ఎవరు అడిగారని ప్రశ్నించారు. ఎన్నికల హామీల్లో గొప్పగా ఇక్కడ బస్సు ఎక్కితే తిరుపతి వెళ్లవచ్చన్నారు. కానీ మోసం చేశారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీమంత్రి తానేటి వనిత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎంపీలు మార్గాని భరత్ రామ్, చింతా అనురాధ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జి.శ్రీనివాసనాయుడు, తలారి వెంకటరావు, పాముల రాజేశ్వరిదేవి, రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్లమెంటు పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దవులూరి దొరబాబు, పిల్లి సూర్యప్రకాశ్, డాక్టర్ పినిపే శ్రీకాంత్, చిన్నమిల్లి వెంకట్రాయుడు, గన్నవరపు శ్రీనివాస్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, వివిధ నియోజకవర్గాల పార్టీ నేతలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మాల కార్పొరేషన్ చైర్మన్‌కు ప్రొటోకాల్ పాటించరా?

సమావేశాన్ని బాయ్‌కట్ చేసిన నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ మాల సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: జిల్లాకు వచ్చిన మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు ప్రభుత్వ యంత్రాంగం ప్రొటోకాల్ పాటించని కారణంగా మాల సంఘ నాయకులు సమావేశాన్ని బాయ్‌కట్ చేశారు. కాకినాడ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ (డీఆర్‌డీఏ సమావేశపు హాలు)లో మంగళవారం మాల కార్పొరేషన్ చైర్మన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లాలో ఉన్న నాయకులకు, ఉద్యమకారులకు సరైన సమాచారం అందించలేదని మాల సంఘ నాయకులు విమర్శించారు. ఒక కార్పొరేషన్ చైర్మన్ వచ్చినప్పుడు పాటించవలసిన ప్రొటోకాల్‌ను పట్టించుకొనకపోవడం విచిత్రంగా ఉందని ఎస్సీ నాయకులు విమర్శించారు. చైర్మన్ వచ్చినప్పుడు కలెక్టర్‌గాని, ప్రభుత్వ అధికారులుకానీ ఉండాలి అలా కాకుండా సాధారణమైన వ్యక్తులను చూసినట్లుగా సమావేశాలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. కలెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించాలని అప్పటి వరకు ఎస్సీ నాయకులంతా సమావేశాన్ని బాయ్‌కట్ చేస్తున్నామంటూ ప్రకటించి నిరసన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాల సంఘాల నాయకులు మాట్లాడుతూ మాల కార్పొరేషన్ చైర్మన్‌ను తాము వ్యతిరేకించడం లేదని, కలెక్టర్ ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం దారుణమన్నారు. కనీసం పోలీసులు గానీ, అధికారులు కానీ హాజరు కాకపోవడం అవమానించడమేనని వివరించారు. నాయకులు తోటి చంగల్‌రావు, సిద్ధాంతుల కొండ బాబు, ఏనుగుపల్లి కృష్ణ, వుల్లం రవి, బోని సంజయ్‌కుమార్, మాతా సుబ్రహ్మణ్యం, ఖండవిల్లి లోవ రాజు, రాగులు రాఘవులు, బొజ్జ ఐశ్వర్య, పెదపాక గురునాధం, దొర్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

పంపా నీళ్లు వృథా

- నాలుగో వంతు సముద్రం పాలు
- గేట్లు బలహీనంతో సమస్య
- 103 అడుగుల గరిష్ట నీటిమట్టం నిర్వహించలేని దుస్థితి



పంపా నీటిని బ్యారేజీ గేటు ద్వారా దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

అన్నవరం: వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసి ఏడాది పొడవునా తాగు, సాగు అవసరాల కోసం నిర్మించిన అన్నవరంలోని పంపా రిజర్వాయర్ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంపాలోకి వెల్లువలా వర్షపు నీరు తరలివస్తున్నా దానిని నిల్వ ఉంచుకోలేని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు కాగా, వివిధ కారణాల వల్ల 99 అడుగులు నీటిమట్టం వరకు మాత్రమే నిల్వ ఉంచుకోవల్సిన పరిస్థితి. అంటే నాలుగు అడుగుల మేర నీరు వృథాగా వదిలేయాల్సి వస్తోంది. రిజర్వాయర్ గరిష్ట నీటినిల్వ 0.43 టీఎంసీలు కాగా దాదాపు నాలుగో వంతు నీటిని వృథాగా వదిలేస్తున్నారు. పంపా బ్యారేజీకి కొత్త గేట్లు ఏర్పాటు చేయకపోవడం, ఉన్న గేట్లకు కూడా మరమ్మతులు పూర్తి చేయలేకపోవడంతో ఈ నీటిని వదిలేయాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. పంపాగర్భంలో నిర్మాణంలో ఉన్న పోలవరం అక్విడెక్ట్ పనుల కారణంగా కూడా పంపా నీటిమట్టం 99 అడుగులకే పరిమితం చేయాల్సి వస్తోందని తెలిపారు. అయితే 12,500 ఎకరాల పంపా ఆయకట్టు పూర్తిగా సాగవ్వాలంటే 1.5 టీఎంసీల నీరు అవసరం. పంపా నీటి నిల్వ పరిమాణం 0.43 టిఎంసీ మాత్రమే. అంటే సుమారు మూడు సార్లు పంపా నిండితే తప్ప సాగవ్వని పరిస్థితి. పంపా నీటిమట్టం 99 అడుగులకే పరిమితం చేస్తే నీటినిల్వ పరిమాణం ఇంకా తగ్గిపోతుంది. దానివలన వర్షాలు తగ్గిన తరువాత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు విడుదల జరగదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బలహీనంగా బ్యారేజీ గేట్లు

తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాలలో 12,500 ఎకరాలకు సాగునీరు, అన్నవరం దేవస్థానం, వివిధ గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు 55 ఏళ్ల క్రితం అన్నవరంలో పంపా రిజర్వాయర్ నిర్మించిన విషయం తెలిసిందే. పంపా బ్యారేజీకి ఏర్పాటు చేసిన ఐదు గేట్లు 20 సంవత్సరాలుగా మరమ్మతులకు గురవడంతో వీటి నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. వరదల సమయంలో గేట్లు ఎత్తడం, దించడం సమస్యగా మారింది. ఫలితంగా వేల క్యూసెక్కుల నీరు వృథాగా దిగువకు పోయి, గ్రామాలు, పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపా బ్యారేజీకి ఐదు గేట్లు నిర్మించేందుకు 2023 ఆగస్టులో రూ.3.36 కోట్లు మంజూరు చేసింది. 2024 ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిధులు విడుదల కాలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో టెండర్లు పిలిచింది. అయితే ఈ టెండర్లు మూడుసార్లు పిలిస్తే తప్ప ఖరారు కాలేదు. చివరగా మే నెలలో ఈ టెండర్లు ఖరారయ్యాయి.

ఖరీఫ్‌లోగా కొత్త గేట్ల ఏర్పాటు సాధ్యంకాదు కనుక పాత గేట్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేయడానికి నిర్ణయించారు. నాలుగో నెంబర్ గేటుకు జూలై మొదటి వారంలో మరమ్మతులు చేశారు. అయితే అప్పటికే వర్షాల వల్ల గేట్ల వద్దకు నీరు రావడంతో ఆ పని నిలిపివేశారు. దాంతో సమస్య ఎప్పటి లాగానే ఉంది. దీంతో ఐదు రోజులుగా వేయి క్యూసెక్కుల చొప్పున సముద్రానికి విడుదల చేస్తున్నారు.

పోలవరం అక్విడెక్ట్ మునగకుండా ఉండాలన్నా..

పంపా రిజర్వాయర్ ఎగువన నిర్మిస్తున్న పోలవరం అక్విడెక్ట్ మునిగిపోకుండా ఉండాలంటే పంపా నీటిమట్టం 99 అడుగులకు మించకుండా ఉండాలి. అదే విషయాన్ని పోలవరం అధికారులు కలెక్టర్‌కు తెలియచేయడంతో ఆ మేరకు నీటిమట్టాన్ని నియంత్రిస్తున్నారు.

ఖరీఫ్‌కు నీటి సమస్య రాకుండా చర్యలు



ఖరీఫ్ అనంతరం పంపా బ్యారేజీకి కొత్త గేట్లు ఏర్పాటు చేస్తాం. అప్పుడు 103 అడుగుల మేర నీటిని నిల్వ చేయొచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ పూర్తి స్థాయిలో సాగు చేసేందుకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

– జీ శేషగిరిరావు, ఈఈ, నీటిపారుదల శాఖ, పెద్దాపురం డివిజన్

ఆటో యూనియిన్ కార్మికుల నిరసన



జగ్గంపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో యూనియన్ కార్మికులు

ఉచిత బస్ మా పొట్ట కొడుతోంది అంటూ ఆవేదన

జగ్గంపేట: జగ్గంపేటలో ఆటో యూనియన్ కార్మికులు ఉచిత బస్సు వల్ల తమ ఉపాధి దెబ్బతిందని, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉచిత బస్ ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం మా కష్టాలను కూడా పట్టించుకుని అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తహసీల్దార్ జేవీఆర్ రమేష్‌కు అందజేశారు. జగ్గంపేటలో ఉన్న నాలుగు ఆటో యూనియన్‌లకు చెందిన సుమారు 1,000 మంది కార్మికులు ఆటోయూనియన్ జేఏసీ పేరుతో జగ్గంపేటలో ప్రధాన వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటోలతో సహా ర్యాలీగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎమ్మెల్యేకు తమ కష్టాలను ఏకరువు పెట్టారు. తాము అప్పులు చేసి వాహనాలు కొన్నామని, ఉచిత బస్ వల్ల తమ ఆదాయం దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఆటో కార్మికుడుకి రూ.12,000 జీవనభృతిగా చెల్లించాలని, ఆర్టీఓ ఫిటినెస్ సర్టిఫికెట్ విషయమై ప్రయివేటీకరణ రద్దు చేయాలని, వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.30వేలు చెల్లించాలని, ఆటో కార్మికులు పిల్లలకు విద్యార్హతను బట్టి అందరికీ ఉద్యోగాలు కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందజేశారు. ఆటో యూనియన్ నాయకులు ఆర్.వెంకటరమణ, ఆర్.శివశంకర్, మంజేటి సత్యనారాయణ, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ రిఫరీగా అంజి



జాతీయ రిఫరీగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అంజి

అమలాపురం టౌన్‌: హైదరాబాద్‌లోని ఉర్దూ మాస్కన్‌ హాల్లో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు తెలంగాణ జు–జిట్సు (యుద్ధ కళ) అసోసియేషన్‌ నిర్వహించిన నేషనల్‌ రిఫరీ, కోచ్‌ సెమినార్‌లో అమలాపురానికి చెందిన పడాల అంజి జాతీయ రిఫరీగా ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు ఆయన అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి జు–జిట్సు చాంపియన్‌ షిప్‌ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే జాతీయ రిఫరీగా ఉత్తీర్ణులైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని జు–జిట్సు ఆంధ్రప్రదేశ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు షేక్‌ యాసిన్‌, ప్రధాన కార్యదర్శి ఎస్‌.గురుప్రభాకరరావు చేతుల మీదుగా అందుకున్నారు.

స్కూల్‌ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



ఈదరపల్లి వంతెనపై నిలిచిన నారాయణ బస్సు

అమలాపురం టౌన్‌: పట్టణంలోని ఈదరపల్లి వంతెనపై నుంచి విద్యార్థులతో వస్తున్న నారాయణ విద్యాసంస్థల బస్సుకు మంగళవారం ఉదయం త్రుటిలో ప్రమాదం తప్పింది. అంబాజీపేట వైపు నుంచి విద్యార్థులను ఎక్కించుకుని అమలాపురానికి ఈ బస్సువస్తోంది. ఆ సమయంలో వెనుక చక్రం ఊడిపోవడాన్ని వంతెనపై ఉన్న జట్టు కార్మికులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్‌ అప్రమత్తమయ్యాడు. చక్రం ఊడి పోవడంతో తక్షణమే బస్సును ఆపి, దానిలోని విద్యార్థులను కిందకు దింపాడు. తిరిగి చక్రాన్ని అమర్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల అమలాపురం విద్యానిధి విద్యా సంస్థలకు చెందిన బస్సుకు కూడా త్రుటిలో ప్రమాదం తప్పింది.

అశ్లీల నృత్యాలపై దాడి

- పోలీసుల అదుపులో నలుగురు యువతులు, 24 మంది పురుషులు
- ఘంటావారిగూడెంలో ఘటన



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

నల్లజర్ల: ఘంటావారిగూడెం గ్రామ శివారులోని రీసార్ట్‌లో జరుగుతున్న అశ్లీల నృత్యాలపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురు డ్యాన్సర్లు (యువతులు), 24 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. ఉంగుటూరు మండలానికి చెందిన వెజ్జు సుబ్బారావు, సురేష్‌ గంటావారిగూడెంలో కొబ్బరితోట లీజుకు తీసుకున్నారు. సురేష్‌ పుట్టినరోజు సందర్భంగా ఈ పార్టీ నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు. అయితే రాత్రి 11.30 వరకూ వీరిపై ఏ కేసు పెట్టాలనే విషయంపై పోలీసులు సమాలోచనలు చేస్తూనే ఉన్నారు. దేవరపల్లి సీఐ నాయక్‌, నల్లజర్ల సీఐ బాలశౌరి ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

మేధో మంథన్‌

- ప్రతిభ ఉంటే.. భవిత మీదే
- విద్యార్థి విజ్ఞాన్‌ మంథన్‌ (వీవీఎం) పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- జాతీయ స్థాయిలో నిర్వహణ
- స్కాలర్‌షిప్‌తో పాటు అనేక ప్రయోజనాలు
- 6వ తరగతి నుంచి ఇంటర్‌ ప్రథమ సంవత్సరం విద్యార్థులు అర్హులు
- ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న వారికి అవకాశం





బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థుల్లో దాగిన ప్రతిభ, ఆలోచన, ఆవిష్కరణలను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన మంథన్‌ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తుంది. దీనిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, దేశంలోని సీఎస్‌ఐఆర్‌, ఐఎస్‌ఆర్‌ఓ, బార్క్‌, డీఆర్‌డీఓ తదితర ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశంతో పాటు ఇంటర్న్‌షిప్‌, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వీవీఎం ఈ పరీక్షపై జిల్లాలోని విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 6వ తరగతి నుంచి 11వ తరగతి (ఇంటర్‌ ప్రథమ సంవత్సరం) వరకూ చదువుతున్న వారందరూ దీనికి అర్హులే.

జాతీయ స్థాయిలో..

ఎన్సీఈఆర్టీ, నేషనల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సైన్స్‌ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా ఈ విద్యార్థి విజ్ఞాన్‌ మంథన్‌ (వీవీఎం) పేరిట జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్‌ ప్రథమ సంవత్సరం వరకు చదివే వారందరూ దీనికి అర్హులే. దీనిలో ప్రతిభ కనబర్చిన వారికి దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌, స్కాలర్‌షిప్‌ పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభమైంది.

ఆన్‌లైన్‌లో అవకాశం

విద్యార్థి విజ్ఞాన్‌ మంథన్‌ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే ఈ రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబరు 30 వరకూ గడువు ఉంటుంది. ఆన్‌లైన్‌లో పాఠశాల స్థాయిలో పరీక్ష జరుగుతుంది. 6వ తరగతి నుంచి 11 (ఇంటర్‌ మొదటి సంవత్సరం) తరగతుల వరకూ విద్యార్థులకు విడివిడిగా ఈ పరీక్ష ఉంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భాషల్లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నారు.

మాక్‌ పరీక్షలు

ఈ పరీక్షకు సంబంధించి మాక్‌ పరీక్షలను సెప్టెంబర్‌ 1వ తేదీ నుంచి నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి ప్రధాన పరీక్ష అక్టోబర్‌ 28 నుంచి 30వ తేదీ వరకూ ఉంటుంది. దీనిలో ఉత్తీర్ణులైన వారికి సెకండ్‌ లెవెల్‌ (ద్వితీయ పరీక్ష) పరీక్ష ఆన్‌లైన్‌ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబర్‌ 19వ తేదీన జరుగుతుంది.

జాతీయ స్థాయికి ఎంపిక ఇలా..

రాష్ట్ర స్థాయి విజేతల్లో ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు నెలకు రూ.2 వేల చొప్పున సంవత్సరం పాటు ఉపకార వేతనం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్‌ మంథన్‌ 2025–26లో జాతీయ, జోనల్‌ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్‌ఐఆర్‌, బీఏఆర్సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగ శాలలు, పరిశోధన సంస్థల్లో ఒకటి నుంచి మూడు వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తారు.

విస్తృతంగా అవగాహన



విజ్ఞాన్‌ మంథన్‌ పరీక్షల్లో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైతే ఉపకార వేతనంతో పాటు ప్రఖ్యాత పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుంది. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించి, నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్‌ యాజమాన్యాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి కలిగినవారు వీవీఎం అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి.

– పిల్లి రమేష్‌, డీఈవో, కాకినాడ జిల్లా

కన్నబాబు ఇంట విషాదం

- తండ్రి సత్యనారాయణ కన్నుమూత
- ప్రముఖుల పరామర్శ
- అంతిమ యాత్రలో వైఎస్సార్‌ సీపీ శ్రేణులు



సత్యనారాయణ (ఫైల్‌)

సాక్షి ప్రతినిధి, కాకినాడ/కాకినాడ రూరల్‌: వైఎస్సార్‌ సీపీలో అందరికీ బాబాయ్‌గా సుపరిచితులైన మాజీ మంత్రి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్‌ కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ(76) మృతి చెందడంతో ఆ పార్టీ శ్రేణుల్లో విషాదం అలుముకుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణను తొలుత కాకినాడ,హైదరాబాద్‌కు అక్కడి నుంచి తిరిగి కాకినాడలో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తూ వచ్చారు. ఆయన చికిత్స పొందుతూ మంగళవారం ట్రస్టు ఆస్పత్రిలో కన్నుమూశారు. భౌతికకాయాన్ని పార్టీ నేతలు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం వైద్యనగర్‌లోని కన్నబాబు ఇంటికి తీసుకువచ్చారు. సత్యనారాయణ భౌతిక కాయాన్ని చూసి కన్నబాబు తల్లి, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. నిడదవోలు మండలం శెట్టిపేటకు చెందిన సత్యనారాయణ ఏజెన్సీలో స్థిరపడ్డారు. ఆయనకు ఐదుగురు సోదరులు, ఇద్దరు తోబుట్టువులు, భార్య కృష్ణవేణి, కుమారులు కన్నబాబు, సురేష్‌బాబు, కళ్యాణ్‌ కృష్ణ ఉన్నారు. వీరిలో కన్నబాబు, సురేష్‌బాబు జర్నలిస్టులు, కళ్యాణ్‌ కృష్ణ సినీ దర్శకుడు.

ప్రముఖుల నివాళి

రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నేతలు, శ్రేణులు తరలివచ్చి కాకినాడ వైద్యనగర్‌లోని కన్నబాబు స్వగృహం వద్ద సత్యనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్ద గల విజ్జపు రెడ్డి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా వైద్యనగర్‌లో నివాసం నుంచి ఊరేగింపుగా అంతిమ యాత్ర నిర్వహించారు. బంధువులు, పార్టీ అభిమానులు, వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. తండ్రి భౌతిక కాయానికి హిందూ సంప్రదాయం ప్రకారం పెద్ద కుమారుడు కన్నబాబు అంత్యక్రియలు నిర్వహించారు.



కాకినాడ వైద్యనగర్‌ నివాసంలో తండ్రి భౌతిక కాయం వద్ద కన్నబాబు, కుటుంబ సభ్యులు



అంతిమ యాత్రలో పాల్గొన్న కన్నబాబు, చిత్రంలో జక్కంపూడి రాజా తదితరులు



సత్యనారాయణ భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి తోట, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు



కన్నబాబును పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణు, గీత, భరత్‌



కన్నబాబును పరామర్శిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి, పిల్లి సూర్యప్రకాష్‌ తదితరులు

కన్నబాబుకు పరామర్శ

కన్నబాబును జెడ్పీ చైర్‌పర్సన్లు విపర్తి వేణుగోపాలరావు, చిన్ని శ్రీను, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్‌, లేళ్ల అప్పిరెడ్డి, అనంతబాబు, పేరాబత్తుల రాజశేఖర్‌, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, మాజీ మంత్రులు దాడిశెట్టి రాజా, వెల్లంపల్లి శ్రీనివాస్‌, గుడివాడ అమర్‌నాథ్‌, జోగి రమేష్‌, చెల్లుబోయిన వేణు, తోట నరసింహం, మేరుగ నాగార్జున, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, మార్గాని భరత్‌, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, అన్నంరెడ్డి అనుదీప్‌, పాముల రాజేశ్వరి, తిప్పల నాగిరెడ్డి, జి.శ్రీనివాస్‌ నాయుడు, తలారి వెంకట్రావు, పిల్లి అనంతలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివ కుమారి, పార్టీ కో ఆర్డినేటర్లు దవులూరి దొరబాబు, పిల్లి సూర్య ప్రకాశరావు, గన్నవరపు శ్రీనివాస్‌, పార్టీ నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, పార్టీ నేతలు రాగిరెడ్డి చంద్రకళా దీప్తికుమార్‌, జమ్మలమడక నాగమణి, గుబ్బల తులసీకుమార్‌, కర్రి పాపారాయుడు, వట్టికూటి రాజశేఖర్‌, చెల్లుబోయిన శ్రీనివాస్‌, పిల్లంక శ్రీనివాసరాజు పరామర్శించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కడియం: మండలంలోని కడియం – జేగురుపాడు మధ్య కెనాల్‌ రోడ్డులోని తుప్పల్లో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం లభ్యమైందని కడియం పోలీసులు తెలిపారు. ఒంటిపై బ్లూ కలర్‌ ప్యాంటు ఉందని, గుండుతో ఉన్నాడన్నారు. ఆ వ్యక్తి రెండు రోజులు క్రితం ఇదే ప్రాంతంలో మతిస్థిమితం లేకుండా తిరిగాడని స్థానికులు చెబుతున్నారన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కడియం పోలీస్‌ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: స్థానిక బ్యాంక్‌ కెనాల్‌లో కొట్టుకువచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. దీనిపై వీఆర్వో సాకా శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు అంగర ఎస్సై హరీష్‌ కుమార్‌ కేసు నమోదు చేశారు. చిన్న వంతెన సమీపంలో మృతదేహాన్ని గుర్తించి పంచనామా చేశారు. అనంతరం పోస్టుమార్టం కోసం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కట్నం వేధింపులపై కేసు

నిడదవోలు రూరల్‌: కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్‌.బాలాజీ సుందరరావు మంగళవారం తెలిపారు. మండలంలోని ఉనకరమిల్లికి చెందిన మిరియాల దుర్గాభవానికి కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన రాజేష్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. అప్పటి నుంచి ఆమెను భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులు కట్నం కోసం వేధిస్తున్నారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి నిందితుడి అరెస్టు

రౌతులపూడి: ఏడాది కాలంగా పరారీలో ఉన్న గంజాయి కేసు నిందితుడైన రౌతులపూడి గ్రామానికి చెందిన గండేపల్లి దుర్గాప్రసాద్‌ను ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. రౌతులపూడి–కత్తిపూడి రహదారిలోని మరిడమ్మ తల్లి గుడి వద్ద అతడిని అరెస్టు చేసి, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో విచారణ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా, అమ్మకాలు చేపట్టినా, తాగినా 94407 96552, 94407 96530 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

యువకుడి ఆత్మహత్య

కపిలేశ్వరపురం (మండపేట): రాయవరం మండలం మాచవరం గ్రామానికి చెందిన యువకుడు మంగళవారం మండపేట మండలం ద్వారపూడిలో చెట్టుకు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండపేట రూరల్‌ సీఐ దొరరాజు, ఎస్సై వి.కిశోర్‌ కథనం ప్రకారం.. మాచవరానికి చెందిన మల్లేశ్వరపు వెంకట్రావు (33) ద్వారపూడి శ్మశాన వాటిక సమీపంలో చెట్టుకు ఉరిపోసుకున్నాడు. ఘటనా స్థలాన్ని సీఐ దొరరాజు, ఎస్సై కిశోర్‌ పరిశీలించారు. భార్య శ్రావణి ఫిర్యాదుపై ఎస్సై వి.కిశోర్‌ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు వెంకట్రావుకు మండపేట మండలం ఏడిదకు చెందిన శ్రావణితో వివాహమైంది.

గోపవరంలో 'తారాజువ్వ' వివాదం

- యువకుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు
- నిడదవోలు ఆస్పత్రిలో చికిత్స



నిడదవోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శ్యాంబాబు

నిడదవోలు రూరల్‌: ఇంటిలోకి తారాజువ్వ దూసుకురావడంతో ప్రశ్నించిన వ్యక్తిపై యువకులు దాడికి పాల్పడ్డారు. సమిశ్రగూడెం ఎస్సై ఎల్‌.బాలాజీ సుందరరావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం గోపవరంలో సోమవారం రాత్రి సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ జయంతి సందర్భంగా కొందరు యువకులు రోడ్డుపై బాణసంచా కాల్చారు. ఆ సమయంలో ఓ తారాజువ్వ లారీ డ్రైవర్‌ ఖండవల్లి శ్యాంబాబు ఇంటిలోకి దూసుకువెళ్లింది. దీంతో శ్యాంబాబు ఆ యువకులను నిలదీశాడు. ఈ నేపథ్యంలో వేముల నాగేంద్ర, ఆరేపల్లి దిలీప్‌, వేముల సాయి, ఆరేపల్లి గాంధీతో పాటు మరికొందరు యువకులు.. శ్యాంబాబుపై ఇటుకలతో దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి యువకులను అదుపులోకి తీసుకున్నారు. తలకు తీవ్ర గాయాలైన శ్యాంబాబును నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుపై సమిశ్రగూడెం పోలీసులు పలువురి యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్‌, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్‌ పరిశీలించారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శ్యాంబాబును కలిసి దాడి ఘటన విషయాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశామన్నారు. గోపవరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు.



గోపవరంలో వివాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్‌, పోలీసులు

నకిలీ దస్తావేజులతో స్థలాల రిజిస్ట్రేషన్‌

- ఐదుగురి సభ్యుల ముఠా అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీవిద్య



నిందితులతో తూర్పు జోన్‌ డీఎస్పీ విద్య తదితరులు

రాజమహేంద్రవరం రూరల్‌: నకిలీ దస్తావేజులు సృష్టించి స్థలాలను విక్రయిస్తున్న ఐదుగురి సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్లు రాజమహేంద్రవరం ఈస్ట్‌ జోన్‌ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం కుప్పనపూడికి చెందిన గొల్లపల్లి కాశీ విశాలాక్షి గతంలో రాజమహేంద్రవరంలో డాక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో 1997లో తన పెద్ద కుమారుడు వినోద్‌ పేరున కవలగొయ్యిలో 267 చదరపు గజాలు, దివాన్‌ చెరువులో 267 చదరపు గజాలు, చిన్న కుమారుడు లక్ష్మణ్‌ పేరున దివాన్‌ చెరువులో 267 చదరపు గజాల స్థలాలను కొనుగోలు చేశారు. అయితే విశాలక్షి భర్త వెంకటేశ్వరరావు 2012లో చనిపోవడంతో ఆమె తన స్వగ్రామం కుప్పనపూడికి వెళ్లిపోయారు. ఆమె కుమారులు ఉద్యోగాల రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. విశాలాక్షి కూడా అమెరికా నుంచి ఇటీవల తన స్వగ్రామానికి వచ్చారు. తన ఆస్తుల కోసం రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో పరిశీలించగా, వాటిని వేరొకరు కాజేసినట్టు గుర్తించారు. దీనిపై ఈ ఏడాది జూన్‌ 14న బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌స్పెక్టర్‌ పి.కాశీ విశ్వనాథ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముఠాగా ఏర్పడి..

కాకినాడకు చెందిన షేక్‌ ఫకీర్‌ మహమ్మద్‌ ఖాసిం బాషాకు 2013 జనవరిలో రియల్‌ ఎస్టేట్‌ బ్రోకర్లుగా పనిచేసే రాజమహేంద్రవరానికి చెందిన మద్దిరెడ్డి లక్ష్మీనారాయణ, మద్దిరెడ్డి నాగేంద్ర ప్రసాద్‌ (సిటీ బస్సు ప్రసాద్‌) పరిచయమయ్యారు. ఎక్కువ కాలం ఖాళీగా ఉండి, ఎవ్వరూ పట్టించుకోకుండా ఉన్న స్థలాల దస్తావేజు జిరాక్సులు తెస్తే, వాటికి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, అధిక ధరకు విక్రయించుకుందామని చెప్పాడు. దానికి మిగిలిన ఇద్దరూ అంగీకరించారు. ఈ నేపథ్యంలో కాశీ విశాలాక్షి కుమారుల స్థలాలకు నకిలీ దస్తావేజులు తయారు చేసి, రిజిస్ట్రేషన్‌ చేయించారు. అనంతరం బయటకు వారికి విక్రయించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఎస్పీ నరసింహ కిశోర్‌ ఆదేశాల ప్రకారం ఈస్ట్‌ జోన్‌ డీఎస్పీ బి.విద్య ఆధ్వర్యంలో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం మద్దిరెడ్డి నాగేంద్ర ప్రసాద్‌, సబ్బితి భాస్కరరావును ఆదర్శనగర్‌లో, షేక్‌ ఫకీర్‌ మహమ్మద్‌ ఖాసిం బాషా, యాదగిరి సురేష్‌, గాలి రాజేంద్ర ప్రసాద్‌లను ఈస్ట్‌ రైల్వే గేటు వద్ద బొమ్మూరు ఇన్‌స్పెక్టర్‌ పి.కాశీవిశ్వనాథం అరెస్టుచేశారు.

డ్రగ్స్‌ రహిత రాష్ట్ర సాధనే ఈగల్‌ లక్ష్యం

- ఈగల్‌ చీఫ్‌ రవికృష్ణ
- నన్నయ వర్సిటీలో సదస్సు



మాట్లాడుతున్న ఈగల్‌ చీఫ్‌ రవికృష్ణ

రాజానగరం: రాష్ట్రాన్ని డ్రగ్స్‌ రహితంగా తీర్చిదిద్దడమే ఈగల్‌ లక్ష్యమని, దీని కోసం జిల్లాకు ఒక సైబర్‌ క్రైమ్‌ పోలీస్‌ స్టేషన్‌ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని ఐజీ ఈగల్‌ చీఫ్‌ ఆర్‌కే రవికృష్ణ తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఎన్టీఆర్‌ కన్వెన్షన్‌ హాలులో మంగళవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్‌ వీక్‌, సైబర్‌ క్రైమ్‌ అండ్‌ డ్రగ్స్‌ అవేర్‌నెస్‌ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే సుమారు 40 వేల విద్యాసంస్థలలో ఈగల్‌ కమిటీలను ఏర్పాటు చేసి, అవగాహన కలిగిస్తున్నామన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్‌ నేరాల పెరుగుదలకు కారణాలన్నారు. సైబర్‌ నేరాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా 1930 టోల్‌ఫ్రీ నంబరుకు తెలియజేయాలన్నారు. నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ 'నో టు డ్రగ్స్‌, ఎస్‌ టు లైఫ్‌' అనే నినాదంతో జీవితంలో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలే కాదు కుటుంబాలే నష్టపోతాయని, ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. ఈగల్‌ ఎస్పీ కె.నగేష్‌ బాబు మాట్లాడుతూ భయం, అభద్రతా భావాలతో మనుషులు జీవించరాదని, ఆనందమైన జీవనాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో సౌత్‌ జోన్‌ డీఎస్పీ భవ్యశ్రీ, రిజిస్ట్రార్‌ ఆచార్య కెవిస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'న్యాయ' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 24 వరకూ నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో పూర్తయిన ఏర్పాట్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బుధవారం నుంచి న్యాయ విభాగం నియామక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ వివరాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకూ జరిగే ఈ పరీక్షలకు 25,173 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జ్యుడీషియల్‌ జిల్లాల్లో స్టెనో గ్రాఫర్‌ గ్రేడ్‌ 3, జూనియర్‌ అసిస్టెంట్‌, టైపిస్ట్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌, ఎగ్జామినర్‌, కాపీయిస్ట్‌, డ్రైవర్‌, రికార్డ్‌ అసిస్టెంట్‌, ప్రాసెస్‌ సర్వర్‌, ఆఫీస్‌ సబార్డినేట్‌ పోస్టులకు ఈ పరీక్షలు జరగనున్నాయి. తొలి విభాగంలో ఉదయం 7.30 నుంచి 8.45 మధ్య అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. 9 నుంచి 10.30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. రెండో విభాగంలో మధ్యాహ్నం 11 గంటల నుంచి 12.15 వరకు లోపలికి అనుమతి, 12.30 నుంచి 2 గంటల వరకూ పరీక్ష జరుగుతుంది. మూడో విభాగానికి సంబంధించి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 3.45 వరకు లోపలికి అనుమతి, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

ఫలితాలే ఎంపికకు ప్రామాణికం

పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే సెంటర్‌ గేట్లను మూసివేస్తారు. అభ్యర్థులు హాల్‌ టిక్కెట్‌, చెల్లుబాటు అయ్యే ఒరిజినల్‌ ఫొటో ఐడీ వెంట తీసుకురావాలి. హాల్‌ టిక్కెట్‌ డౌన్‌లోడ్‌ సమస్యలకు హెల్ప్‌ డెస్క్‌ ఫోన్‌ నంబర్‌ 0863 2372752, ఈ–మెయిల్‌ హెచ్‌సీ.ఏపీ.ఎట్‌దరైటాప్‌ ఏఎల్‌జే.గవ్‌.ఇన్‌ లో సంప్రదించాలి. పరీక్షల ఫలితాలే అభ్యర్థుల ఎంపికకు ప్రామాణికం. ఎటువంటి ఇంటర్వ్యూలు నిర్వహించరు. స్టెనోగ్రాఫర్‌, టైపిస్ట్‌, కాపీయిస్ట్‌, డ్రైవర్‌ పోస్టులకు విడిగా నైపుణ్య పరీక్ష ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. కేంద్రంలో సమస్యలపై సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అలాగే 0863 2372752 నంబర్‌కు ఫోన్‌ చేయవచ్చు.



పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

- కాకినాడ జిల్లాలోని రాయుడుపాలెం వద్ద సాఫ్ట్‌ టెక్నాలజీస్‌ కేంద్రం, అచ్యుతాపురం రైల్వే గేట్‌ దగ్గర నున్న ఆయాన్‌ డిజిటల్‌ జోన్‌లో ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.
- సూరంపాలెం అదిత్య కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీలో 24న నిర్వహిస్తారు.
- రాజమహేంద్రవరంలోని రాజీవ్‌ గాంధీ గ్రూప్‌ ఆఫ్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌లో 20, 21. 22, 24 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.
- అమలాపురం పరిధిలోని అభ్యర్థులకు చెయ్యేరు శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ, భట్లపాలెంలోని బీవీసీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్స్‌లో ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహిస్తారు.